

పగిలిన ప్యాడీ క్లీనింగ్ మెషిన్ పైపు



పగిలిన ప్యాడీ క్లీనింగ్ మెషిన్ పైపు

# మొరాయిస్తున్న ప్యాడీ క్లీనర్లు

- 321 కొనుగోలు కేంద్రాలకు 143 మెషిన్లు
- ఇబ్బందులు పడుతున్న రైతన్నలు

**శెనార్తి మీడియా, మంచిర్యాల :**

జిల్లాలో రైతులు పండించిన వరి ధాన్యాన్ని తూర్పార పట్టి తాలు, తప్ప లేకుండా చేసుకునేందుకు జిల్లా మార్కెటింగ్ అధికారులు కొనుగోలు చేసి తీసుకొచ్చిన యంత్రాలు మొరాయిస్తుండటంతో రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. అవి ఎప్పుడు పని చేస్తయో, ఎప్పుడు మూలన పడుతున్నాయో తెలియడం లేదు. ఆరిన ధాన్యాన్ని కాంటా పెట్టే ముందు ఈ యంత్రాలలో ధాన్యం పోసి క్లీన్ చేద్దామంటే రైతులకు కష్టాలు తప్పడం లేదు.

**321 కొనుగోలు కేంద్రాలకు 143 మెషిన్లు**

జిల్లాలో 321 కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేయనున్నామని అధికారులు అధికారికంగా ప్రకటించారు. వీటికి సరిపడా ప్యాడీ క్లీనర్లను తెప్పించడంలో పూర్తిగా విఫలమయ్యారు. పాత క్లీనర్లు 94 ఉండగా ఇటీవల మరో 49 ప్యాడీ క్లీనర్లు తెప్పించినట్లు సమాచారం. దీనితో జిల్లా వ్యాప్తంగా మొత్తం 143 యంత్రాలు మాత్రమే ఉన్నాయి. రైతులందరు వీటి ద్వారా ధాన్యాన్ని ఎలా తూర్పార పట్టిస్తారో అధికారులకే తెలియాలి... ఒక వైపు తూర్పార పట్టిన ధాన్యానికే కారణాలు చెబుతూ బస్తాకు కిలో నుంచి రెండు కిలోలు మిల్లర్లు కోతలు పెడుతుంటే ప్యాడీ క్లీనర్ లేని కేంద్రం నుంచి వెళ్లిన లారీకి బస్తాకు ఇంకెన్ని కిలోలు కోత పెడుతారోనని రైతులు ఆందోళన చెందుతున్నారు.

పాడైపోయిన ప్యాడీ క్లీనింగ్ మెషిన్ ను రిపేరు చేస్తున్న స్థానికులు



మొరాయిస్తున్న ప్యాడీ క్లీనర్లు

రైతుల సౌలభ్యం కోసం తీసుకొచ్చిన ప్యాడీ క్లీనర్లు పట్టుమని పది రోజులు కూడా కాకుండానే పని పెడుతున్నాయి. ఒక మిషన్ కుప్ప నుంచి ధాన్యాన్ని లాగే మోటరు చెడిపోతే, మరో యంత్రం ధాన్యం గింజలను తీసుకునే పైపు చెడిపోవడం.., మరి కొన్ని యంత్రాలు ఏకంగా స్టార్ట్ చేస్తే పొగలు వస్తున్నాయని, ఇలాంటి యంత్రాలతో ఎలా ధాన్యం శుద్ధి చేసేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెడిపోయిన యంత్రాలకు మరమ్మతులు తామే చేసుకోవాల్సి వస్తుందని, ఇవి తమపై అదనపు భారమే అవుతుందని 'శెనార్తి మీడియా'తో వాపోయారు.

**కేంద్రానికి ఒక యంత్రం సరిపోతుందా..?**

కొనుగోలు కేంద్రానికి పెద్ద ఎత్తున ధాన్యం వస్తుంటుంది. ఒక కేంద్రానికి ఒక యంత్రం ఇస్తే రైతులందరి ధాన్యం తూర్పార పట్టడం ఎలా సాధ్యపడుతుంది. ఎండలకు ధాన్యం ఆరబోసిన రెండు రోజుల్లోనే తేమ శాతం తగ్గి ప్రభుత్వ ప్రమాణాలకంటే తక్కువైతుంది. ఒక్కో రైతు వద్ద 10 తేమ శాతానికి వస్తున్నాయి. ఈ రైతులందరి ధాన్యం ఒక్క యంత్రంతో తూర్పార పట్టడం సాధ్యమయ్యే పనేనా..? రైతులను ఇబ్బందులు పెట్టడానికి తప్ప రైతులకు చేసిన మేలు ఇట్లనేనా అంటూ రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆర్వెస్టింగ్ చేసే సమయంలోనే ఫ్యాన్ 18 ఆర్పీఎం పెట్టించి కోయించినా మళ్లి లేనిపోని కండిషన్ లు పెట్టి సతాయించడం తప్ప మరేమి లేదంటూ అసహనం వ్యక్తం చేస్తున్నారు. యంత్రాలు ఇస్తే కేంద్రానికో 10 పంపియ్యాలే కానీ చాట్ల తౌడు పోసి కుక్కల కొట్లాట పెట్టినట్లు ఒక మిషన్ పంపి రైతులను కొట్టుకునేటట్లు చేస్తుండ్రని కేంద్రాలకు ధాన్యాన్ని తీసుకొచ్చిన రైతులు వాపోతున్నారు.

**రైతులకు తప్పని తిప్పలు**

కమీషన్లకు కక్కుర్తి పడి నాసీ రకం యంత్రాలను తెప్పించిన అధికారులు వాటిని ఎలా ఉపయోగించాలి, వాటి సామర్థ్యం ఎంత అని కనీసం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు అవగాహన కూడా కల్పించకపోవడంతో వాటిని ఉపయోగించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. యంత్రాలను తీసుకుపోయి రైతులకు అప్పగిస్తుండటంతో ఎలా దీనిని ఆపరేట్ చేయాలో తెలియడం లేదని వాపోతున్నారు. సంబందిత కంపనీ టెక్నీషియన్ వచ్చి అవగాహన కల్పించాల్సి ఉండగా ఎవరూ రాకపోవడంతో తెలిసీ తెలియకుండా ఆపరేట్ చేస్తూ రైతులు ఇబ్బందులు పడుతున్నారు. దీనితో కొంత మంది రైతులు తూర్పార పట్టిన ధాన్యంలో తాలు, తప్ప వస్తుందని, మా కష్టం అంతా వృథానే అయ్యిందని, మిల్లర్ కొంత చెత్త ఉన్నా కోతలు విధిస్తుందని బాధను వెల్లగక్కారు. ఇప్పటికైనా కంపెనీ టెక్నీషియన్ ను పిలిపించి యంత్రం ఎలా వాడాలో అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



రైతు కుప్ప వద్ద విద్యుత్ సరఫరా లేకపోవడంతో పక్కన పడేసిన యంత్రం

# గులాబీ జెండాతోనే సంక్షేమం

- బీఆర్ఎస్ రజతోత్సవ సభపై ప్రజల్లో ఆసక్తి
- స్వచ్ఛందంగా తరలివచ్చేందుకు సిద్ధంగా ఉన్నరు
- రాష్ట్ర ప్రణాళికా సంఘం మాజీ ఉపాధ్యక్షుడు బీ వినోద్‌కుమార్



**శెనార్తి మీడియా, కరీంనగర్ :**

"సకల జనుల సంక్షేమాన్ని కాంక్షించేది గులాబీ జెండానేనని రాష్ట్ర ప్రణాళికా సంఘం మాజీ ఉపాధ్యక్షుడు బీ వినోద్ కుమార్ పేర్కొన్నారు. ఆనాటి జలదృశ్యం నుంచి నేటి ఎల్కతుర్తిలో రజతోత్సవం దాకా గులాబీ జెండా పోరుబాట పట్టిన విషయాన్ని గుర్తు చేశారు. మంగళవారం సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని తెలంగాణ భవన్‌లో విలేకరులతో ఆయన మాట్లాడారు. ఈ నెల 27న ఎల్కతుర్తిలో నిర్వహిస్తున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభకు ప్రజల నుంచి అపూర్వ స్పందన వస్తున్నదని, స్వచ్ఛందంగా తరలివచ్చేందుకు సిద్ధమవుతున్నారని చెప్పారు. పెద్ద సంఖ్యలో వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలిపారు. బహిరంగ సభ దిగ్విజయం కావడం ఖాయమన్నారు. తెలంగాణ రాష్ట్రం తెస్తామని చెప్పి సాధించి చూపించిన మహానాయకుడు కేసీఆర్ అంటూ కొనియాడారు. తొమ్మిదేళ్ల పాలనలో దేశంలోనే తెలంగాణను అగ్రగామిగా నిలిపిన ఘనత ఆయనకే దక్కుతుందని ప్రశంసించారు. తెలంగాణ సాధన కోసం పోరాడింది గులాబీ జెండానేనని ఈ సందర్భంగా గుర్తు చేశారు. రాష్ట్రానికి రావాల్సిన నీళ్లు, నిధులు, నియామకాల గురించి కేసీఆర్ నాయకత్వాన పూర్తి స్థాయిలో పరిశీలించిన తర్వాతనే రాష్ట్రం ఏర్పాటైతేనే సమస్యలన్నీ పరిష్కారమవుతాయని భావించారన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 3 ద్వారా పార్లమెంట్‌లో బిల్లు పాసైతేనే రాష్ట్రాలు ఏర్పాటవుతాయనే విషయాన్ని గుర్తించి చాలా మంది మేధావులు, మిత్రులు, రాజకీయ నాయకులతో చర్చించి పార్టీని స్థాపించినట్లు పేర్కొన్నారు. 2001 ఏప్రిల్ 27న హైదరాబాద్‌లోని జలదృశ్యంలో జెండా ఎగురవేసి తెలంగాణ సాధన కోసం ఉద్యమించారని గుర్తు చేశారు. ఆనాడు తెలంగాణ ఉద్యమకారుల్లో అపనమ్మకాన్ని సృష్టించి దుష్ప్రచారం చేశారని, అవమానకర మాటలతో ఉద్యమాన్ని నీరుగార్చే కుట్రలు చేశారన్నారు.సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షు డు తోట ఆగయ్య, పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి, వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనర్సింహారావు, జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, టెక్స్‌టైల్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, జడ్పీ మాజీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ జిందం కళ, వేములవాడ బీఆర్ఎస్ నేత ఏనుగు మనోహర్‌రెడ్డి, నాయకులు బొల్లి రామ్మోహన్, కుంబాల మల్లారెడ్డి, మాజీ సర్పంచులు పాల్గొన్నారు.


## తిరుపతి నాయక్‌కు మాజీ ఎంపీ వినోద్ కుమార్ పరామర్శ



**శెనార్తి మీడియా, కరీంనగర్:** బీఆర్ఎస్ రజతోత్సవ సభ సందర్భంగా నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో గాయపడిన కొత్తపల్లి మాజీ వైస్ ఎంపీపీ, చింతకుంట మాజీ ఎంపీటీసీ తిరుపతి నాయక్‌ను మంగళవారం మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ పరామర్శించారు. తిరుపతి నాయక్ ఇటీవల రజతోత్సవ సభ ఏర్పాట్లలో పాల్గొనగా, ప్రమాదవశాత్తు గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎంపీ వినోద్ కుమార్ ఆయనను కరీంనగర్ శాంతినగర్‌లోని నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఆయన ఆరోగ్య స్థితిని అడిగి తెలుసుకున్నారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు పార్టీ తరపున ఆదుకుంటామని భరోసా ఇచ్చారు



## ఇంటర్ ఫలితాల్లో బాలికల ముందంజ





**శెనార్తి మీడియా, బెజ్జంకి:** ఇంటర్మీడియట్ బోర్డు మంగళవారం విడుదల చేసిన ఫలితాల్లో బాలికలు ముందంజ లో నిలిచారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఫస్టియర్‌లో 80 మంది పరీక్ష రాయగా, 16 మంది ఉత్తీర్ణులయ్యారు. సెకండి యర్‌లో 67 మంది పరీక్ష రాయగా, 30 మంది ఉత్తీర్ణత సాధిం చారు.ఫస్టియర్‌లో ఎంపీసీ గ్రూపులో ఉమేష్ చంద్ర 404, ఒకేషనల్ విభాగంలో సరిత 409 మార్కులు సాధించారు. మోడల్ స్కూల్ విద్యార్థినులు వైష్ణవి ఎంపీసీలో 470/425, మనిషా బైపీసీలో 440/ 318, భూమిక సీఈసీలో 500/393 మార్కులతో నిలిచారు. సెకండియర్‌లో ఎంపీసీలో అర్చన 910/1000, బైపీసీలో వినీత 985/1000, సీఈసీలో కృష్ణవేణి 740/1000 మార్కులతో ఉత్తీర్ణు లయ్యారు. బైపీసీలో వినీత రాష్ట్రస్థాయిలో ర్యాంక్ సాధించడం మోడ ల్ స్కూల్‌కు గర్వకారణంగా ఉందని ప్రిన్సిపాల్ సంగీత హర్షం వ్యక్తం చేశారు.ఎంపీసీలో నూనె అక్షయ 915, బైపీసీలో జెట్టి శివ 911 మార్కులు సాధించారు.

## ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

**శెనార్తి మీడియా, మానకొండూర్:** మానకొండూర్ మండలం చెంజర్ల గ్రామంలో విడ్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఉపాధి హామీ కూలీలకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆర్థిక అక్షరాస్యత కేంద్ర కౌన్సిలర్ క్రాంతి కుమార్ మాట్లాడుతూ... పొదుపు అలవాటు చేసుకోవాలని, డబ్బును సురక్షితమైన పథకాలలో పెట్టుబడి పెట్టాలని సూచించారు. రిజర్వ్ బ్యాంక్ నియంత్రిత సంస్థల ద్వారా మాత్రమే డిపాజిట్ లేదా అప్పు తీసుకోవాలని తెలిపాడు. ఆన్లైన్ మోసాలు పెరుగుతున్న నేపథ్యంలో ఓటీపీ, ఎటిఎం పిన్, పాస్‌వర్డ్ లాంటి వివరాలు ఎవరికీ చెప్పవద్దని హెచ్చరించాడు. మోసానికి గురైన వెంటనే 1930 నంబర్‌కు ఫిర్యాదు చేయాలని సూచించాడు. జీవిత భీమా, ప్రమాద భీమా కోసం జీవన్ జ్యోతి, సురక్ష యోజన లాంటి కేంద్ర పథకాలను వినియోగించుకోవాలని, సుకన్య సమృద్ధి పథకం ఆడపిల్లల భవిష్యత్తుకు ఉపయుక్తమని వివరించాడు. కార్మికుల సందేహాలను నివృత్తి చేసి, మరికొందరికి కూడా అవగాహన కల్పించాలంటూ కోరారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ మొండయ్య, కౌన్సిలర్లు సాగరిక, శ్రీనివాస్ పాల్గొన్నారు



## ప్రైవేట్ కు దీటుగా ప్రభుత్వ విద్యాసంస్థల ఫలితాలు

- మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ



**శెనార్తి మీడియా, మానకొండూర్:** ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు విద్యారంగంలో రాణిస్తూ ప్రైవేటు విద్యాసంస్థల విద్యార్థులకు కూడా పోటీగా నిలుస్తున్నారని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మంగళవారం మానకొండూర్ మండలం దేవంపల్లిలోని గురుకుల ఆశ్రమ పాఠశాలను సందర్శించిన ఆయన, జేఈఈ మెయిన్స్‌లో రాష్ట్రస్థాయిలో రెండో ర్యాంకు సాధించిన ఎస్. అనురాగ్‌తో పాటు క్వాలిఫై అయిన మరో 12 మంది విద్యార్థులను సత్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఇలాంటి ఫలితాలు ప్రభుత్వ విద్యా వ్యవస్థలో ఉన్న నాణ్యతకు నిదర్శనమన్నారు. చిన్ననాటి నుంచే లక్ష్యాన్ని పెట్టుకుని క్రమశిక్షణ, పట్టుదలతో చదివితే విజయాలు సాధ్యమవుతాయని అన్నారు. విద్యార్థులతో పాటు వారిని తీర్చిదిద్దిన అధ్యాపకులకు, తల్లిదండ్రులకు ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ మర్రి ఓదెలు యాదవ్, వైస్ చైర్మన్ రామిడి తిరుమల్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు ద్యావ శ్రీనివాస్ రెడ్డి, కోండ్ర సురేష్, దూలం దేవేంద్ర, నాగిశెట్టి రాజయ్య, బండి మల్లేశం, గుడాల మహేందర్, రేమిడి శ్రీనివాస్ రెడ్డి, అంజయ్య, జీడి శ్యామ్, బుర్ర శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు



## తొర్రూరు(జె)లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

**శెనార్తి మీడియా, తొర్రూరు:** పాలకుర్తి నియోజకవర్గంలోని తొర్రూరు(జె) గ్రామంలో రూ.19 లక్షల నిధులతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ హనుమాండ్ల ఝాన్సీ రాజేందర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ పాలనలో ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు కొనసాగుతు న్నాయని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో నిధుల కొరత లేకుండా గ్రామాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వబడుతోందన్నారు. గ్రామ ప్రజల అభ్యర్థన మేరకు ఈ పనులకు నిధులు మంజూరయ్యాయని, వెంటనే పనులు ప్రారంభించనున్నట్టు చెప్పారు. శంకుస్థాపన అనంతరం ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, ఇంచార్జ్ ఝాన్సీ రాజేందర్ రెడ్డి గ్రామంలో ఉన్న దుర్గమ్మ తల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, గ్రామస్తులుపాల్గొన్నారు.

# ప్రైమరీ స్కూల్‌లో వార్షికోత్సవ సందడి



**శెనార్తి మీడియా, గన్నేరువరం:**

గన్నేరువరం మండల కేంద్రంలోని ప్రైమరీ పాఠశాలలో మంగళవారం పాఠశాల వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఐదవ తరగతి విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమం ఏర్పాటు చేశారు. విద్యార్థులకు ప్రగతిపత్రాలను ఎంఈఓ కే. రామయ్య, విద్య కమిటీ చైర్ పర్సన్ రాపోల్ లావణ్య అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ రామయ్య . బడిబాట కరపత్రాలను కూడా ఆవిష్కరించారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో సందడి చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు ఆర్. సాయి శిరీష, ఉపాధ్యాయులు జె. ప్రసన్న, బుర్ర మధు, ఆర్. వేణుగోపాల్, వి. అనిత, జి. తిరుపతి, పి. స్వరూప, తల్లి దండ్రులు పాల్గొన్నారు.